# మెఱుపులు: ఒక శుభాకాంక్షాపత్రము

- వేమూరి వేంకట రామనాథం

శుభాకాంక్షల అచ్చుపత్రాలలో (cards) ఎన్నో రకములైన వాక్యాలు కూర్చబడి యుండటం మనకు తెలిసిన విషయమేగదా. ఈ మధ్య నాదృష్టిని ప్రత్యేకంగా ఆకర్షించిన ఒక పత్రంలో ఇలా ఉంది: "పిల్లలు తమ తల్లితండ్రుల నుండి చిఱునవ్వు నేర్చుకుంటారు" అని. ఇది అసాధారణపత్రంగా నాకు తోచింది. ఇందులో రెండు ప్రతి పాదనలున్నాయి, జాగ్రత్తగా పరిశీలిస్తే: ఒకటి, తల్లితండ్రులు చిఱునవ్వు పిల్లలకు "వారసత్వం" వలె అందించగలరని; రెండు, పిల్లలు చిఱునవ్వు అవలంబించగల మార్దవం గల్గినవారని. మొదటిది లోట్టైతే రెండవది అంత సులభం కాదు, అన్న ధ్వని కూడ ఉన్నదీ వాక్యాలలో. మొదటిది మాత్రం ఉన్నా, పిల్లలు కొందఱకు చిరునవ్వు చిందించటం సాధ్యం కాక పోవచ్చును కూడ. కాని చిఱునవ్వు తలితండ్రులు అందించ గలిగితే, పిల్లలకు ఆసద్గుణచ్చాయ సులభంగా సంక్రమిస్తుంది.

ఈ పత్రంలోని ప్రత్యేకత యేమంటే, చిఱునవ్వుకు శక్తిగల పిల్ల(వాడు) అది తన తలితండ్రులనుండి పారంపర్య విధంగా తనకు సంక్రమించింది అని వ్యక్తీకరించటం. ఈ ఊహ తనకు కల్గినదంటే చిఱునవ్వులో అంతర్గతమైన దమము లేక ఆనందభావం ముఖంలో మెల్లగా ప్రతిబింబింపజేయగల చాకచక్యము తన తలితండ్రులకున్నదని తాను గ్రహించగల శక్తి కల్గి యుండవలెనన్నమాట.

ఈ పరిశీలనలో అతి ముఖ్యమయిన విషయం యిది: "చిఱునవ్వు" "పకపక నవ్వు" కన్న ఏవిధంగా భిన్నమయినదో మనం గమనించాలి. వేఱే చెప్పనక్కఱ లేకుండానే, పకపక నవ్వు పెద్దగా ఉంటుందని, అదుపులేని ధ్వనికి ఆలవాలమని, మనకు తట్టుతుంది. కాని చిఱునవ్వు నీలాకాశం మీద తటిల్లతలాగానో, వేకువవేళ చీకటి మలుపులలో తొంగి చూచే ఉషఃకిరణంలాగానో, ఉంటుంది. దీని లాలిత్యం మధ్యాహ్నపు టెండలో గోచరించదు. ఈ కారణంగా ఇది ఎండకన్న గొప్పదన్న సూచన లేదు; దేని అందం దానిదే, దేని సహజత్వం దానిదే.

ఈ సందర్భంలో ఒక సన్నివేశ తారతమ్యం గమనించుదాం; ఆకారణంగా చిఱునవ్వు ఒకదానిలోను పకపకనవ్వు మఱొక దానిలోను ప్రదర్శితమవుతాయని గ్రహించగలం. ఒక చక్కని చిత్రం చూచిన ప్పుడు కాని, అందమైన ఒక వ్యక్తిని చూచినప్పుడు కాని, హృదయానికి ఆనందం కలిగించే వార్త విన్నప్పుడు కాని, పెదవులు కదలికదలనట్లు అనుభూతి పొంది, కనుఱెప్పలు విప్పుకొన్నట్లు చలించి, ముఖంలో ఏదో నిగనిగ తటాలున విజృంభించి నట్లు ద్యోతకమవుతుంది. అయితే, యీ మొగములోని మార్పులు మెల్లగా నిండుతనంతో కలగటమన్నది స్వతః ఒక వ్యక్తికి సాధ్యం కావచ్చును గాని, తల్లితండ్రులలో అలాంటి శక్తి ఉంటే, అది అనుదినము గమనిస్తూ వచ్చిన పిల్లలలో ఆశక్తి సులువుగా, నిరంతర ఆలోకనకు సమానాంతరంగా వర్ధిల్లుతుంది. ఇది నేర్పనక్కఱలేని సహజ ప్రవృత్తి గా వారిలో నాటుకు పోతుంది. ఇదే ఆ పత్రంలోని అంతర్గత భావం. ఇక్కడ తల్లితండ్రుల "పాలు" ఎంత అంటే; సహజంగా పిల్లలకు చిఱునవ్వు చిలకరించే శక్తి ఏర్పడటం అసంభవం కాదు గాని, తమకు గల అలాంటి శక్తి తాము నిర్దేశించనక్కఱ లేని విధంగా పిల్లలలో బీజప్రాయంగా నాటుకు పోతుంది. తల్లితండ్రుల చిఱునవ్వు మొగాలను సహజమైన దగ్గఱితనంలో గమనించే పిల్లలకు, ఆరేఖలు తమలో అచ్చుపడుతున్నవని తాము గ్రహించకుండానే, సహజప్రకృతి ధర్మంగా తమకు కూడ చిఱునవ్వు లభ్యమవుతుంది.

ఇక పకపకనవ్వు. సులభమైన ఉదాహరణలు: సినిమాలలో మధ్యమధ్య దృశ్యమయ్యే కొన్ని సంఘటనలు, మాటలు మనలో సాధారణంగా పకపకనవ్వును పుట్టిస్తాయి. పొట్ట చెక్కలయ్యేట్లు నవ్వించటమే వాటి ప్రధాన - ఉద్దేశ్యం. ఛార్లీ ఛాప్లిన్ నడక, మొగం త్రిప్పటం, పద్మనాభం ప్రవర్తన, "మాయాబజార్" లో రమణారెడ్డి నటన, ఇవన్నీ చక్కని ఉదాహరణలే, సాధారణంగా అందఱిలోను పెద్ద నవ్వు పుట్టించేవిగా ఇక్కడ ప్రేక్షకునిలో కలిగేది చిఱునవ్వు వంటి అదుపులో తళుక్కుమనే ఆనందస్ఫురణ కాదు, పెద్దగా నవ్వు

వలె ననిపించే హాస్యస్ఫురణ. దీనికి అవసరం ఉన్నది. అది "ఘనం"గా కలిగించటంలో నటకుని ప్రజ్ఞ దానిని "వాచ్యం" చేసే రచయిత తెలివితేటలు బైటపడతాయి.

ఇలా కాక ముఖ్యంగా తల్లితండ్రుల పెంపకం మీద ఆధారపడి ప్రజ్వలించే చిఱునవ్వు సంగతి మఱొక విధంగా గమనించుదాం. వారి పసితనంలోనే - అనగా వారు ఒళ్ళో ఒదిగియుండే నాడే - తల్లితండ్రుల ముఖాలలోని పులకరింపులు వారు స్పష్టంగానో అస్పష్టంగానో మనోఫలకంలో అచ్చు గుద్దుకుంటూనే యుంటారు. ఈ దశలో వారికి ప్రక్కవారి పకపక నవ్వులు అంతగా మనసుకెక్కవు, తల్లితండ్రులయినా దగ్గఱకు తీసికొని - "దృష్టి" పడుతుందేమోనన్న అంతర్భయంతో - మెల్లగా వారి బుగ్గలు పుణుకుతూ తమ ఆనందం, సంతసం, వారికి అనురక్తితో అందజేస్తారు. ఈ విధమైన చిఱునవ్వు వాతావరణంలో తమ బిడ్డలను పెంచిన తల్లితండ్రుల ముఖాలలో అచ్చుపడియున్న చిఱునవ్వు చిన్నెలు అదృశ్యంగా, అప్రయత్నంగా ఆ పసిపిల్లల అంతరంగంలో ప్రవేశిస్తాయి. క్రమంగా వారికి చిఱునవ్వు మొగం రూపించటం అలవడుతుంది. ఈ విశిష్టమైన వికసనం, విన్యాసం వారికి తమ తల్లితండ్రులనుండి అదృశ్యంగా కాని స్ఫుటంగా సంభవిస్తుందని మనం ఊహించవచ్చును.

ఈ విధమైన తల్లితండ్రుల లాలన లేని పసిపిల్లలకు, పాపలకు, వారిలో గల చిఱునవ్వు మోము తీరు అబ్బుతుందో లేదో, సంఖ్యాశాస్త్రరీతిగా మనం చెప్పలేము; కాని ఊహాపథరీత్యా, అది అంత సులభం కాదన్న సందియం మనం వెల్లడి చేయవచ్చు. పెంచు కొన్న తల్లితండ్రుల మాట వేఱు, పరిస్థితులను బట్టి; ఎంత చిన్న వయసులో పెంపుడగుట సంభవించిందో, దానిని బట్టి, ఆ పిల్ల(వాడు) పెరిగిన రీతిలో తల్లితండ్రుల చిఱునవ్వు గుఱుతులు ఉంటాయో లేదో, - ఆధారపడియుంటుంది. (it depends).

చిఱునవ్వు పిల్లలు "నేర్చుకుంటారు" అన్న (ఆపత్రంలోని) వాక్యాలలో అక్రియాపదం గూర్చి ఒక మాట చెప్పవలసియుంది.

సాధారణంగా "నేర్చుకునే వారికి" ఆవిద్య "నేర్పబడటం" ఉంటుంది. ఇక్కడ కూడ అలాంటి అన్వయం కోసం ప్రయత్నిస్తే, అంతగా ఉపయోగం ఉండదనుకుంటాను. ఏమంటే యిది నేర్చుకునేవారికి ఎవరో నేర్పేది కాదు. ఇక్కడి నేర్పరితనం పిల్లల సహజ రీతి మీద ఆధారపడి ఉంటుంది; దానికి మూలసూత్రం తల్లితండ్రుల ముఖవిన్యాసం, పిల్లల యెడ లాలన.

ఈ పత్రంలోని ప్రాణతుల్యమైన అంశం ఏమంటే, పిల్లల ముఖంలో ఆనందం వెలుగు చిమ్మవలెనంటే, దానికి ముఖ్య కారణం తమ తల్లితండ్రులు అని; వారి పెంపకం అని, అందులో ఎంతో గూఢమైన, గాఢమైన అర్థం ఉంది. వారిద్దఱి మధ్య ప్రేమబంధం అమృతతుల్యంగా విరిసియుంటేనే వారి ముఖంలోని కళాకాంతులు, వారి అనునయం లోని ఆత్మీయత ఉత్తమంగా, తేనెయంత తీపిగా, అమృతమంత చిరత్వస్ఫోరకంగా ఉంటాయి. అపుడే పిల్లల మనస్సులలో ముద్రపడుతుంది. దాంపత్యజీవనంలోని ఏకత్వం యొక్కచాయ. దాని చాయ పిల్లల మొగం విప్పారిన సంతోష సందర్భంలో ప్రకృతి సిద్ధమైన చిఱునవ్వుగా కలకలలాడుతుంది.

వ్యాస సమాప్తిలో ఒక మాట. ఈ పత్రంలోని వాక్యం ఎవరో వ్యాసకర్త సాంఘిక స్థితుల పరిశీలనలో, లేక పరిశోధనలో (research), నిర్ధరించిన సత్యం లాంటిది కావచ్చును; కాని ఈ పత్రం ఒక పిల్ల(లేక పిల్లవాడు) తన తల్లితండ్రులకు పంపే శుభ సందేశం - బహుశః వారి పుట్టిన దిన సందర్భంలో - అయినప్పుడు, దానిలోని ఉత్తమతరమైన భావం లేక సందేశం ఏమిటంటే, ఆపంపిన పిల్ల(వాని) మనస్సులో తన తల్లితండ్రుల యెడ యెలాంటి అతిగభీరభావం ఉన్నదో మనకు తెలుస్తుంది - ఆసంతకం చేసిన పిల్ల(వానికి) న్యాయపత్రం (leagal document) మీద సంతకం చేసినంత అన్యోన్యం కలదని. ఎదురుగా దుకాణంలో ఉన్న వివిధపత్రాలలో ఏరికోరి యీపత్రం పంపిన వ్యక్తికి అలాంటి అన్యోన్యభావం, తల్లితండ్రుల మీద సహజమైన నిండు వాత్సల్యం ఉన్నదని మనం అనుకొనవచ్చును.

ఈ వ్యాసం మూల వస్తువు నేను అనుకొనకుండా ఈ మధ్య నామనస్సును ఊపిన ఒక పత్రం!

******